క్లుప్తంగా...

'మే డేను వైభవంగా నిర్వహిస్తాం'



మంత్రి మల్లారెడ్డితో సమావేశమైన శ్రీనివాస్

చాంద్రాయణగుట్ట: మే 1న కార్మిక దినోత్సవాన్ని చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని బీఆర్‌టీయూ నియోజకవర్గం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిని సీనియర్ నాయకుడు మారయ్యతో కలిసి మే డే నిర్వహణపై చర్చించారు. పాతబస్తీలోని జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఆటో యూనియన్, ఆశా వర్కర్స్, అంగన్‌వాడీ తదితర కార్మిక నాయకులను సంఘటితపరిచి మే డేను వైభవంగా నిర్వహిస్తామన్నారు. మే డే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ వైఖరిని కార్మికులంతా ఐక్యమై ఎండగట్టాలన్నారు.

'బీఆర్‌ఎస్ స్కాంల ప్రభుత్వం'



అమర్‌సింగ్

గోల్కొండ: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రజల ఆదరణ కోల్పోయిందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు స్కాంల ప్రభుత్వమని ఎగతాళి చేస్తున్నారని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ అన్నారు. తెలంగాణలో అవినీతి స్వయంగా ముఖ్యమంత్రి సారథ్యంలో జరుగుతుందని ఆయన ఆరోపించారు. అభివృద్ధి పనులంటూ వేల కోట్ల రూపాయలు తమ ఖాతాలో వేసుకోవడం సీఎం కేసీఆర్‌కే చెల్లిందన్నారు.

పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఏఎస్.రావు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గోషామహల్ నియోజకవర్గం టీడీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏఎస్.రావు ఆధ్వర్యంలో గురువారం రోగులకు పండ్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధినేత మాజీ సీఎం చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

గో పూజలు




అబిడ్స్: వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకుని గోశాలలో గోవులకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు వరకుమార్ గుప్తా మాట్లాడుతూ.. ప్రతి అమావాస్యకు గో పూజలు చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాసవి క్లబ్ తరఫున తరచూ పలు రకాల సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాగి ప్రకాష్, నాంపల్లి శ్రీనివాస్, ఉప్పల వినీత్ గప్తా, కందూరి గౌరీశెట్టి పాల్గొన్నారు.

దొంగకు రిమాండ్

చాంద్రాయణగుట్ట: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యాచకురాలి చేతిలో ఉన్న సంచిని లాక్కొని ఆమెను కింద పడేసిన యువకుడిని శాలిబండ పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా వట్టెపల్లికి చెందిన వృద్ధురాలు అమీనా స్థానికంగా భిక్షాటన చేస్తుంది. ఈనెల 19న మధ్యాహ్నం శక్కర్‌గంజ్‌లో భిక్షాటన చేస్తుండగా ఆమె వెనుక నుంచే వచ్చిన అబ్దుల్ అహ్మద్ ఖాన్(23) చేతిలో ఉన్న సంచిని లాక్కొని ఆమెను కిందపడేసి పరారయ్యాడు. ఆ సంచిలో రూ.2 వేల నగదు, బట్టలున్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు నాలుగైదు చోరీ కేసులలో పాత నేరస్థుడిగా ఉన్నాడు.

జుమ్మాతుల్ విదాకు పాతబస్తీ సిద్ధం

- కొనసాగనున్న ట్రాఫిక్ ఆంక్షలు
- చివరి శుక్రవారం సందర్భంగా మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు



ముస్తాబైన మక్కా మసీదు

చార్మినార్: జుమ్మాతుల్ విదాను పురస్కరించుకొని మక్కా మసీదులో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రంజాన్ మాసంలో వచ్చే చివరి శుక్రవారాన్ని 'జుమ్మాతుల్ విదా' అంటారు. ఈనెల 21న నిర్వహించే జుమ్మాతుల్ విదా (అల్ విదా జుమ్మా) సందర్భంగా ముస్లింలు మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. భక్తిశ్రద్ధలతో జరిగే జుమాతుల్ విదా సామూహిక ప్రార్థనలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మక్కా మసీదు సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు హజా అనంతరం 12.45 గంటలకు కుద్బా కార్యక్రమం జరుగుతుంది. 1.10 గంటలకు సామూహిక ప్రార్థనలు ప్రారంభమవుతాయి. మక్కా మసీదు కతీబ్ రిజ్వాన్ ఖురేషీ సామూహిక ప్రార్థనలు చేయించనున్నారు. మక్కా మసీదు ప్రాంగణంతో పాటు చార్మినార్, చార్ కమాన్, గుల్జార్‌హౌజ్, లాడ్‌బజార్, సర్దార్ మహల్ తదితర రోడ్లపై శుక్రవారం ఉదయం కార్పెట్లను ఏర్పాటు చేయనున్నారు.

పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు..

- ఇప్పటికే చార్మినార్ కట్టడం నలువైపుల వాహనాలకు నో ఎంట్రీ అమలులో ఉండడంతో ఇక శుక్రవారం జుమ్మాతుల్ విదా ప్రార్థనల సందర్భంగా ఇతర దారుల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించనున్నారు.
- ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.
- శాలిబండ నుంచి నయాపూల్ వరకు వాహనాలు వెళ్లడానికి ఎటువంటి అవకాశం లేకపోవడంతో నగర పోలీస్‌కమిషనర్ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.
- చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, శంషీర్‌గంజ్, సయ్యద్ అలీ ఛబుత్రా తదితర ప్రాంతాల నుంచి వాహనాలన్నింటిని హిమ్మత్‌పురా చౌరస్తా ద్వారా ఖిల్వత్ నుంచి మూసాబౌలి, సిటీ కాలేజీ చౌరస్తా ద్వారా దారి మళ్లిస్తారు.
- నగరంతో పాటు అఫ్జల్‌గంజ్ నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలన్నింటినీ దారుషిఫా, మీరాలంమండి, బీబీబజార్ చౌరస్తా ద్వారా దారి మళ్లించనున్నారు.
- యాకుత్‌పురా, డబీర్‌పురా ద్వారా చార్మినార్ వైపు వచ్చే వాహనాలన్నింటినీ బీబీ బజార్, పురానీహవేలీ ద్వారా దారి మళ్లించనున్నారు. అలాగే పురానాపూల్, కసరట్ట, లాడ్‌బజార్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ముర్గీ చౌక్ ద్వారా మూసాబౌలి వైపు దారి మళ్లించనున్నారు.

యౌముల్ ఖురాన్ పఠనం సభలో పాల్గొననున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.

- మక్కా మసీదులో జరిగే యౌముల్ ఖురాన్ పఠన కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొని ప్రసంగించనున్నారు.
- పవిత్ర మాసం రంజాన్ ప్రాధాన్యతను ఒక వైపు వివరిస్తూనే.. మరోవైపు ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ముస్లింల ఆర్థిక స్థితిగతులు, ఉగ్రవాద చర్యలు, అమాయకుల వేధింపులు తదితర అంశాలపై ఆయన ప్రసంగం ఉండవచ్చునని మజ్లిస్ పార్టీ నాయకులు చెబుతున్నారు.
- పాతబస్తీలో దక్షిణ మండలం పోలీసులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అదనపు పోలీసు బలగాలతో బందోబస్తును కొనసాగిస్తున్నారు.

జుమ్మాతుల్ విదాకు భారీ బందోబస్తు..



సాయి చైతన్య, డీసీపీ

చార్మినార్: జుమ్మాతుల్ విదాను పురస్కరించుకొని శుక్రవారం దక్షిణ మండలంలోని పాతబస్తీలో అదనపు బలగాలతో గట్టి బందోబస్తును కొనసాగించనున్నట్లు దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. గురువారం పురానీహవేలిలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఒక కంపెనీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ నుంచి 5 ప్లాటూన్ల పోలీసు బలగాలను బందోబస్తులో వినియోగిస్తున్నామన్నారు. దీనికి తోడు దక్షిణ మండలంలోని నాలుగు ఏసీపీ డివిజన్ల పోలీసు సిబ్బంది శాంతి భద్రతల పర్యవేక్షణలో ఉంటారన్నారు. సామూహిక ప్రార్థనలు జరిగే మక్కా మసీదు, చార్మినార్, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టి తదితర ప్రధాన రోడ్డులో ముస్లిం ప్రజలకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. అవసరమైన చోట బారికేడ్లను ఏర్పాటు చేసి బందోబస్తును కొనసాగించనున్నామన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు



సామ్రాట్ అశోక్

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ అన్నారు. రంజాన్ మాసం జుమ్మాతుల్ విదాను పురస్కరించుకొని గురువారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి మక్కా మసీదు–చార్మినార్‌లో పర్యటించి తగిన ఏర్పాట్లను పరిశీలించారు. అంతకు ముందు మక్కా మసీదు–చార్మినార్ రోడ్డులోని గ్రానైట్ రోడ్లను వాటర్ ట్యాంక్‌లతో కడిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం మక్కా మసీదులో జరుగనున్న సామూహిక ప్రార్థనల సందర్భంగా ముస్లింలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేసి పూర్తిగా ప్రక్షాళన చేయాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సభావత్ కల్యాణ్

చార్మినార్: టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేసి పూర్తిగా ప్రక్షాళన చేయాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రటరీ, బోర్డు మెంబర్స్‌ని అరెస్ట్ చేసి విచారణ చేయాలని ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సభావత్ కల్యాణ్ డిమాండ్ చేశారు. గురువారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కోఠి జిల్లా చార్మినార్ శాఖ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువకులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మాకు ఉద్యోగాలు వస్తాయి.. మా బతుకులు బాగుపడతాయని.. కోటి ఆశలతో తెలంగాణ ఉద్యమం కొనసాగించి అక్రమ కేసులు భరించి జైళ్లతో చెలిమి చేసి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణలో ఈరోజు నియామక పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత గల టీఎస్‌పీఎస్‌సీ పేపర్లు అమ్ముకునే దౌర్భాగ్యమైన పరిస్థితికి దిగజారిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు దిలీప్, కార్యదర్శి సజన్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ రాహుల్, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీకాంత సందీప్, ప్రియా, చందు, భావ్యశ్రీ, అభి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అబిడ్స్: బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే కేసీఆర్ అభినందన సభ పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. సొసైటీ అధ్యక్షుడు కొమ్ముల నరేందర్ ఆధ్వర్యంలో ఈనెల 21న రవీంద్రభారతిలో కేసీఆర్ అభినందన సభ నిర్వహిస్తున్నారు. సచివాలయానికి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ పేరును నామకరణం చేసినందుకు కేసీఆర్ అభినందన సభ నిర్వహిస్తున్నట్లు కొమ్ముల నరేందర్ తెలిపారు. శుక్రవారం నిర్వహించే కేసీఆర్ అభినందన సభకు రాష్ట్రంలోని పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

'అవార్డు అందుకోవడం గర్వంగా ఉంది'



అవార్డు అందుకున్న గండం నర్సింహ

జియాగూడ: బీఆర్.అంబేద్కర్ విద్యావికాస్ అవార్డును అందుకోవడం గర్వంగా ఉందని జియాగూడ మాదిగ సేవా సంఘం అధ్యక్షుడు గండం నర్సింహ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం జియాగూడ మాదిగ సేవా సంఘంలో మాట్లాడారు. 2016లో స్థాపించిన జియాగూడ మాదిగ సేవా సంఘం నుంచి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నేటికీ విజయవంతంగా కొనసాగిస్తున్నామన్నారు. పేదవారి కుటుంబంలో మృతిచెందిన వారి ఖర్చుల కోసం ఆర్థిక సహాయాన్ని కూడా అందజేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే జియాగూడ దుర్గానగర్‌లోని అంబేద్కర్ భవనంలో నిరుపేద మహిళలు, యువతులకు శిక్షణా ఉపాధి కార్యక్రమాల్లో భాగంగా కుట్టు శిక్షణ, ఇతర రంగాలలో శిక్షణలు త్వరగా చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు చెన్నయ్య, కోశాధికారి డి.మన్నెం, మొగులయ్య, నరేందర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎంజీబీఎస్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అఫ్జల్‌గంజ్: అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. గురువారం అగ్నిమాపక అవగాహన వారోత్సవాల్లో భాగం మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లో ఆర్టీసీ సిబ్బందికి, ప్రయాణీకులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎఫ్ అధికారులు ప్రకాష్‌రెడ్డి, యజ్ఞనారాయణ, సుధాకర్, ఆర్టీసీ రంగారెడ్డి ఆర్ఎం శ్రీధర్, అధికారులు రాజు, శ్రీనివాస్, మహంకాళీ రామమూర్తి, హనుమంతు, కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సమివుల్లా

బహదూర్‌పురా: మీరాలం ఈద్గా రంజాన్ సామూహిక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సమివుల్లా, బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ మోజం ఖాన్ అన్నారు. గురువారం మీరాలం ఈద్గాను జలమండలి, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, పోలీసు అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సామూహిక ప్రార్థనలకు 2 లక్షలకు పైగా వచ్చే ముస్లింలకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్యే మోజం ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు సభ్యులు, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహీనుద్దీన్, కార్పొరేటర్ ఖాదర్, వక్ఫ్ బోర్డు అధికారి ఖాజా మోహీనుద్దీన్, ఫలక్‌నుమా ఏసీపీ సయ్యద్ జహంగీర్, చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి జలమండలి మేనేజర్ కృష్ణ, విద్యుత్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు మక్కా మసీదులో యౌముల్ ఖురాన్ సభ

శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో చివరి శుక్రవారం సందర్భంగా మజ్లిస్ పార్టీ (ఎంఐఎం) ఆధ్వర్యంలో జల్సా–ఇ–యౌముల్ ఖురాన్ సభను నిర్వహించనున్నట్లు మక్కా మసీదు నిర్వాహకులు తెలిపారు. చివరి ఐదో శుక్రవారం సందర్భంగా మజ్లిస్ పార్టీ (ఎంఐఎం) ఆధ్వర్యంలో యౌముల్ ఖురాన్ సభకు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొంటారన్నారు.

ఆచార్య వేణుకు సన్మానం



ఆచార్య వేణును సత్కరిస్తున్న జేఎన్ఏఎఫ్ఏయూ ఉపాధ్యాయులు

విజయనగర్‌కాలనీ: ఫొటోగ్రఫీ కోర్సులో నాలుగేళ్ల ఇక్కడ దిద్దుకున్న ఓనమాలు, నేర్చుకున్న చదువు గురువుల ప్రోత్సాహం తనకు వెన్నుదన్నుగా నిలిచాయని బలగం సినిమాటోగ్రఫి ఆచార్య వేణు అన్నారు. ఇటీవల విడుదలై హిట్ సినిమాగా నిలిచిన బలగం సినిమాటోగ్రఫర్ వేణు మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ ఫొటోగ్రఫి విభాగంలో విద్యను అభ్యసించారు. ఈ మేరకు గురువారం ఆయనకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య వేణు మాట్లాడుతూ.. ఇదే కళాశాలలో తాను 2006 నుంచి 2010 వరకు చదివిన రోజులు, ఉపాధ్యాయులతో పాటు స్నేహితుల అనుబంధం తనకు మధురానుభూతులను పంచిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గంగాధర్, ఫొటోగ్రఫి విభాగాధిపతి ప్రొఫెసర్ కమల్‌రాయ్, ప్రొఫెసర్ మధుకర్ పాల్గొన్నారు.

మౌలానా మౌసిన్‌కు సన్మానం

గోల్కొండ: తరావీ ప్రార్థనల్లో పాల్గొన్న వారికి ఖురాన్ గ్రంథ పఠనం చేసినంత పుణ్యఫలం లభిస్తుందని అల్ హజ్ రయీస్ అలీఖాన్ అన్నారు. రంజాన్ మాసపు తరావీ ప్రార్థనలు పూర్తయిన సందర్భంగా గురువారం బురుది మసీదులో ఇమామ్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తరావీలో ఖురాన్ గ్రంథ పఠనం గావించిన హజ్రత్ మౌలానా మహ్మద్ మోసిన్‌ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఇమామ్ మహ్మద్ మోసిన్ ఎంతో నిష్ఠగా ఈ తరావీ ప్రార్థనలు చేయించారన్నారు. ఉమర్ అలీఖాన్, ఆమెర్ అలీఖాన్, ఇమ్రాన్ అలీఖాన్, షాన్నవాజ్ అలీఖాన్ తదితరులున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

చాంద్రాయణగుట్ట: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్షను విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉప్పుగూడ మహంకాళి ఆలయ సమీపంలో నివాసం ఉండే బాలికపై 2022 జూలై 27న నేనావత్ వంశీకృష్ణ(25) లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న ఛత్రినాక పోలీసులు నాంపల్లి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన నాంపల్లి 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి అనిత నిందితుడికి ఐదేళ్ల శిక్షను విధిస్తూ గురువారం తీర్పును వెలువరించింది.

'కంటి వెలుగు'కు విశేష స్పందన

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి అసంఘటిత రంగ కార్మికుల నుంచి విశేష స్పందన లభించిందని చీఫ్ ఇంజినీర్, ఎస్టేట్ మేనేజర్ షేక్ గౌస్ మోహీనుద్దీన్ అన్నారు. టౌన్‌షిప్‌లో మార్చి 28 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు ఉచితంగా కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి గురువారం కళ్ల అద్దాలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పవన్ నాయక్, డాక్టర్ గ్రేస్ ఎస్లీ, మెర్సిలిన్ (సూపర్‌వైజర్), సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



రంజాన్ కానుకలను అందజేస్తున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అనిల్ కుమార్

డబీర్‌పురా: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అనీల్‌కుమార్ అన్నారు. గురువారం కాలికబర్‌లో రంజాన్ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన రంజాన్ కానుకలతో పాటు షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం సందర్భంగా మసీదులకు నిధులతో పాటు రంజాన్ కానుకలను అందజేయడం సంతోషకరమన్నారు. పేద ప్రజలకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు ఎంతో ఆసరాగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇస్మాయిల్ ఖాన్, కిషన్ మోహన్, మజ్లిస్ పార్టీ నాయకులు ఆసిఫ్, రావూఫ్ పాల్గొన్నారు.



రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఫరాజ్, రహ్మతుల్లా తయ్యబ్

షేక్‌పేట్‌లో..

గోల్కొండ: మజ్లిస్ పార్టీ తన సెక్యులర్ విధానాలతో ముందుకు సాగుతుందని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద ఫరాజుద్దీన్ అన్నారు. గురువారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లోని విరాట్‌నగర్ కుంటలో నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. మజ్లిస్ సీనియర్ నాయకులు మహ్మద్ రహ్మతుల్లా తయ్యబ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కూడా తాను బతుకమ్మ పండగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అందిస్తున్న బతుకమ్మ చీరలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు మహ్మద్ ముస్తఫా, మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు తదితరులున్నారు.

మత సామరస్యానికి ప్రతీకలు ఇఫ్తార్ విందులు

జియాగూడ: మత సామరస్యానికి ప్రతీకలు ఇఫ్తార్ విందులని జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం మిత్ర అసోసియేట్స్ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ ఆధ్వర్యంలో మైనార్టీలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు జహంగీర్, నవాబ్ నసీర్, బాకీర్ నవాబ్, అయూబ్, జాఫర్, కేశవ్, శేఖర్‌రెడ్డి, ఉమేష్ పాల్గొన్నారు.

శాలిబండ డివిజన్‌లో..

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని ఖాజీపురా నవాయత్ మసీదులో గురువారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలకు బస్తీవాసులు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. అనంతరం ముస్లింలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉపవాస దీక్షలను విరమించారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అన్ని వర్గాలకు ప్రజలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

అబిడ్స్: అన్ని వర్గాల ప్రజలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. జాంబాగ్ ఏక్‌మినార్ మజీద్ వద్ద నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ప్రసంగించారు. మైనార్టీలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పథకాలు ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, ఇలియాజ్, అహ్మద్‌ఖాన్, మసూద్, మహమూద్, ఆసీఫ్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ

అన్నదానం



అన్నదానం చేస్తున్న అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్

చార్మినార్: హైదరాబాద్ అగర్వాల్ కుంభమేళా, అశోక్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో గురువారం అమావాస్యను పురస్కరించుకొని రికాబ్‌గంజ్‌లో పేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. సమాజంలోని పేదలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తగిన సహకారాలు అందజేయాలన్నారు. ప్రతినిధులు రాజ్ కమల్, సురేంద్ర నార్నోలి, సునిల్, శివరాం, నవీన్ పాల్గొన్నారు.

ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద..



అన్నదానం చేస్తున్న సంఘం సభ్యులు

గౌలిపురా: అమావాస్యను పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం గౌలిపురా, లాల్‌దర్వాజా, హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ సంయుక్తాధ్వర్యంలో గురువారం గౌలిపురా బతుకమ్మ బావి వద్దనున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చైర్మన్లు రెడ్డిశెట్టి చంద్రశేఖర్‌రావు, శ్రీరాం కోటయ్య గుప్తా, గౌరవ అతిథులు హైదరాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్, వాసవీ కేంద్రం అధ్యక్షులు ఆలంపల్లి రవి కుమార్, మ్యాంగ దయాకర్, సలహాదారులు కాశెట్టి పాండు గుప్తా, చీల రాములు గుప్తా పాల్గొన్నారు.